క్లుప్తంగా

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించండి

సి.బెళగల్: గ్రామాల్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి, సంబంధిత వివరాలను ఉన్నతాధికారులకు చేరవేయాలని తహసీల్దార్ అనుపమ అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఎస్‌ఐ తిమ్మారెడ్డి, ఎన్నికల సెక్టోరియల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని 49 పోలింగ్ కేంద్రాల్లో 17 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఆయా గ్రామాలను సందర్శించి గ్రామస్తులు, స్థానిక నేతలతో చర్చించి పోలింగ్ కేంద్రాలపై సమగ్ర నివేదికలను సెక్టోరియల్ అధికారులు తమకు అందజేయాలన్నారు. మండలంలో ఎన్నికలు సజావుగా జరిగేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఈఓఆర్డీ సందీప్, ఎంఈఓ ఆదామ్‌బాషా, ఇరిగేషన్ ఏఈ సూర్యప్రకాష్, గూడూరు ఈఓఆర్డీ మధులత, ఏఎస్‌ఓ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం

సి.బెళగల్: పొదుపు మహిళలు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని మండల వైకేపీ ఏపీఎం వెంకటస్వామి అన్నారు. మంగళవారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో మండల మహిళా సమాఖ్యా సమావేశం నిర్వహించారు. ఏపీఎం ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయ ఆవశ్యకత, పద్ధతులు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, లాభాలను వివరించారు. అదే విధంగా బ్యాంక్‌ల ద్వారా పొందిన రుణాలను సకాలంలో చెల్లించి రుణాలను రీ షెడ్యూల్ చేసుకోవాలని మహిళలకు సూచించారు. ఆయా సంక్షేమ పథకాలు, కార్యక్రమాల ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. సమావేశంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి వైకేపీ సీసీలు రాముడు, శ్రీనివాసులు, గుండమయ్య, కరుణాకర్, వీఓఏలు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్షలకు బందోబస్తు కల్పించండి



ఎస్‌ఐతో చర్చిస్తున్న గురుకుల ప్రిన్సిపల్

సి.బెళగల్: మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించనున్న ప్రవేశ పరీక్షల నిర్వహణకు పోలీస్ బందోబస్త కల్పించాలని పాఠశాల ప్రిన్సిపల్ బలరాముడు ఎస్‌ఐ తిమ్మారెడ్డిని కోరారు. ఈ నెల 10వ తేది పాఠశాలల్లో ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సర ప్రవేశ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఉదయం ఐదో తరగతి పరీక్షకు 1012 మంది విద్యార్థులు, మధ్యాహ్నం ఇంటర్ ప్రవేశ పరీక్షకు 524 విద్యార్థులు హాజరుఅవుతారని చెప్పారు. అనంతరం పీహెచ్‌సీలో డాక్టర్ ముథున్‌కుమార్‌ను కలిసి పరీక్ష రోజు వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని కోరారు.

సేవా మార్గంతోనే భగవంతుడి ఆశీర్వాదం



దివ్యాంగుడికి ఆర్థిక సాయం అందిస్తున్న ఖాజా మాలిక్

కల్లూరు: సేవా మార్గంతోనే భగవంతుడి ఆశీర్వాదం పొందవచ్చని గ్లోబల్ టౌన్‌షిప్ అధినేత ఎస్.ఖాజా మాలిక్ అన్నారు. మంగళవారం కల్లూరు ఫొటో, వీడియోగ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో కల్లూరులోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఖాజా మాలిక్ ఆర్థిక సహకారంతో దాదాపు 60 మంది మానసిక దివ్యాంగులకు ఆర్థిక చేయూత, పండ్లు, ఫ్రూట్ జ్యూస్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడతూ ప్రతి మనిషి వివిధ రకాల వృత్తుల్లో నిమగ్నమైనప్పటికీ భగవంతుడి ఆశీర్వాదం కావాలి అంటే సేవా మార్గంలో ఉండాలన్నారు. కార్యక్రమంలో స్వాత్మానంద స్వామి, బాషా తదితరులు పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు



చిన్నారి చేతికి ఇంక్‌మార్క్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ శైలేష్ కుమార్

కల్లూరు: నిండు జీవితానికి రెండు చుక్కలు చాలా అవసరమని ఆర్‌బీఎస్‌కే కార్యక్రమ ఇన్‌చార్జి డాక్టర్ శైలేష్‌కుమార్ అన్నారు. మంగళవారం ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని అన్ని గ్రామాల్లో మిగిలిపోయిన 105 మంది చిన్నారులకు ఇంటింటికీ తిరిగి వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు పల్స్ పోలియో చుక్కలు వేశారు. ఉలిందకొండ గ్రామంలో జరుగుతున్న పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ ఎమ్‌పీహెచ్‌ఈఓ విజయ్ కుమార్, సూపర్‌వైజర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం సాకారం

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- ప్రభుత్వ భవనాలు, సీసీ రోడ్లు ప్రారంభం
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు



తమ్మరాజుపల్లెలో హెల్త్ క్లినిక్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

పాణ్యం: దేశంలోనే మొదటి సారిగా గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసి.. ప్రజల చెంతకు ప్రభుత్వ సేవలను తెచ్చామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం పలు గ్రామాల్లో పూర్తి చేసిన ప్రభుత్వ భవనాలు, సీసీరోడ్లు ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కేవలం నాలుగు సంవత్సరాల పాలనలో అందులో కూడా రెండేళ్లపాటు కరోనా విళయతాండవం చేసినప్పటికీ ఎక్కడా అభివృద్ధి, సంక్షేమం నిలిచిపోలేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లన్నారు. తమ్మరాజుపల్లెలో గ్రామంలో రూ. 25లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.25లక్షలతో నిర్మించిన హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ హెల్త్ సెంటర్‌ను నిర్మించినట్లు తెలిపారు. హెల్త్ సెంటర్‌లో మెరుగైన వైద్య సేవలు గ్రామంలోనే అందిస్తున్నామన్నారు. మద్దూరు గ్రామంలో రూ.40లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనం, రూ.11 లక్షల వ్యయంతో నిర్మించిన పాఠశాల ప్రహరీ, ఆర్బీ వద్ద రూ.10లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, పశువైద్యశాల వద్ద రూ.5లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు.

అనుకున్న లక్ష్యాలు సాధించాం

నాలుగు సంవత్సరాల వ్యవధిలోనే అనుకున్న లక్ష్యాలను సాధించామని ఎమ్మెల్యే అన్నారు. నెరవాడ గ్రామ ప్రజల ఏళ్లనాటి కల అయిన ఆర్‌జీఎం నుంచి పుట్టాలమ్మ వరకు బీటీ రోడ్డు పనులను రూ. 2.25కోట్లతో ప్రారంభించామని చెప్పారు. రూ. 25లక్షలతో గ్రామ సచివాలయం, రూ. 21.80లక్షల వ్యయంతో ఆర్‌బీకేను నిర్మించి రైతుల ముగింటకే సేవలు అందించామన్నారు. ఎస్సీ, బీసీ కాలనీలో రూ.13లక్షల జీజీఎం నిధులతో సీసీరోడ్డు, ఎస్సీ కాలనీలో రూ. 10లక్షల ఎంపీ నిధులతో మరో సీసీ రోడ్డు వేసి కాలనీల అభివృద్ధికి కృషి చేశామన్నారు. గ్రామంలో గడప గడపకు–మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటించినప్పుడు ఆర్‌జీఎం నుంచి పుట్టాలమ్మ వరకు రోడ్డు వేయాలని గ్రామస్తులు కోరారన్నారు. వారికి ఇచ్చిన మాట ప్రకారం ఎన్నికల కోడ్ రాకముందే రోడ్డు పనులు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ , జెడ్పీటీసీ సద్దల సరళమ్మ, జెడ్పీటీసీ మాజీ శభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, కో– ఆప్షన్ సభ్యులు జాకీర్ ఉసేన్, నాయకులు షేక్షావలి, శేషారెడ్డి, బాలరాజు, బాలిరెడ్డి, శేషయ్య, మద్దూరు సర్పంచ్ ప్రదీప్‌రెడ్డి , శ్రీనాథ్‌రెడ్డి , మండల సచివాలయాల కన్వీనర్ సుమంత్‌రెడ్డి , మహింద్రారెడ్డి, సుధాకర్, నాయకులు పాల్గొన్నారు.

మరో మారు వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ

పాణ్యం : త్వరలో జరగబోవు సార్వత్రిక ఎన్నికల్లో పాణ్యం నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ జెండాను మరోమారు ఎరుగవేయాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఆయన సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ పిలుపునిచ్చారు. మంగళవారం నెరవాడ గ్రామంలో పలు ప్రభుత్వ కార్యాలయాల ప్రారంభోత్సవం అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. 1985 నుంచి పాణ్యం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తున్నామన్నారు. ఈ నాలుగేళ్ల పాలనలో ఏపీ దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. గ్రామంలోనే సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేసి పింఛన్‌దారుల ఇంటి వద్దకే వెళ్లి నగదు ఇస్తున్నారన్నారు. ఈ ఏడాది వర్షాలు తక్కువగా పడినప్పటికీ ముందు చూపుతో రైతులకు సాగునీరు ఇవ్వాలనే లక్ష్యంతో గోరుకల్లులో 10 టీఎంసీలపైనే నీటిని నిల్వ చేశామన్నారు.

ప్రతిపక్ష నాయకుల విమర్శలు అర్థంలేనివి

ప్రతిపక్ష నాయకులకు ప్రతి రోజూ అధికార పార్టీపై ఏదో ఒక విమర్శ చేయడం అలవాటై పోయిందని ఎమ్మెల్యే అన్నారు. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో ప్రతిపక్షాలు ప్రజల వద్దకు వచ్చి తాము అధికారంలోకి వస్తే అది చేస్తాం, ఇది చేస్తామని గాల్లో మేడలు కట్టే ప్రయత్నం చేస్తారని.. వాటిని నమ్మొద్దన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట

కల్లూరు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేశారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం కొంగనపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఓహెచ్‌ఎస్ఆర్ ట్యాంక్‌ను, రూ. 3.44 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనుల భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని, ఎంపీపీ బోయ శారద ముఖ్య అతిథులుగా హాజరై ట్యాంక్, భూమి పూజ శిలాఫలకాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సువర్ణమ్మ, మండల జేసీఎస్ కన్వీనర్ ఇన్‌చార్జి కేశవరెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, గ్రామ నాయకులు జి.ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



పత్తి సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

కోడుమూరు రూరల్: పత్తి సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని నంద్యాల వ్యవసాయ పరిశోధన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు సూచించారు. మంగళవారం కోడుమూరు రైతుభరోసా కేంద్రంలో ఏడీఏలు సాలురెడ్డి, వెంకటేశ్వర్లు, ఏఓ శశిధర్‌రెడ్డి, వ్యవసాయ శాస్త్రవేత్తలు లక్ష్మి కల్యాణి, మోహన్, విష్ణువర్ధన్, శివరామక్రిష్ణ, జయసింహా, ఏఓ రవిప్రకాష్ గౌడ్ రైతులకు పత్తి పంటసాగుపై అవగాహన కల్పించారు. అధిక సాంద్రత పద్ధతిలో రైతులు ఎకరా పొలంలో ఎర్రనేలల్లో అయితే 29 వేల మొక్కలు, నల్లరేగడి నేలల్లో 14 వేల మొక్కలు ఉండేలా పత్తి మొక్కలను నాటుకోవాలని తెలిపారు. తద్వారా పురుగు, తెగుళ్ల ఉధృతి తగ్గడంతో పాటు, మొక్కపోషకాలు అందుకోవడానికి, గాలి తగలడానికి అనువుగా ఉంటుందన్నారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వాడాలని, ఒకే రకమైన పత్తి విత్తనాలు కాకుండా 2 నుంచి 3 రకాలు విత్తాలని, గులాబి రంగు పురుగు ఉధృతిని తట్టుకోవడానికి పెరముంట్రాప్స్‌ను అమర్చుకోవాలని సూచించారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



ఆసరా చెక్కును అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్, కూడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

- వైఎస్సార్ ఆసరా నాల్గో విడత కింద 1,475 సంఘాలకు రూ.8.75 కోట్లు
- నామినేటెడ్ పదవుల్లో 50 శాతం మహిళలకు ఇచ్చిన ఘనత జగనన్నదే
- కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్, ఆదిమూలపు సతీష్



కార్యక్రమానికి హాజరైన మహిళలు

కర్నూలు సిటీ: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన నాయకుడు సీఎం వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్, కూడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు.. మంగళవారం మామిదలపాడులోని ఓ ఫంక్షన్ హాలులో కర్నూలు రూరల్ మండల పరిధిలోని పొదుపు సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించారు. కర్నూలు రూరల్ మండల పరిధిలోని 1475 సంఘాలకు ఆసరా నాల్గో విడత రూ.8.75 కోట్లు రుణ మాఫీ నిధులను జమ చేశారన్నారు. మహిళాభ్యున్నతికి సీఎం పెద్దపీట వేశారన్నారు. ఎక్కడా లేని విధంగా నామినేటెడ్ పోస్టుల్లో 50 శాతం మహిళలకు.. రాజ్యాంగ పదవుల్లో 50 శాతం బీసీలకు కేటాయించిన ఏకైన నాయకుడు జగనన్న మాత్రమేనని అన్నారు.

పొదుపు మహిళలకు రూ.35 కోట్లు మాఫీ

కర్నూలు రూరల్ మండల పరిధిలోని 1475 పొదుపు సంఘాలకు 2019 ఎన్నికల నాటికి బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు రూ.35 కోట్లు ఉన్నాయని... ఇచ్చిన హామీ మేరకు నాలుగు విడతల్లో మొత్తం రుణ మాఫీ చేశారని తెలిపారు. మహిళలకు అమ్మ ఒడి కింద రూ.15 వేలు, చేయూత కింద రూ.18,750, పేదలకు ఇళ్లు అందిస్తున్నామన్నారు. మహిళల రక్షణ కోసం దిశా యాప్, దిశా మహిళా పోలీస్‌స్టేషన్లను తీసుకొచ్చారన్నారు. మరోసారి వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ఆసరా చెక్కును అందజేసి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ సభ్యులు ప్రసన్నకుమార్, మౌలాలి, వైస్ ఎంపీపీ నెహిమియా, పార్టీ మండల కన్వీనర్ మహబూబ్ బాషా, జేసీఎస్ కన్వీనర్ సత్యంరెడ్డి, ఎల్లమ్మ ఆలయ పాలక మండలి చైర్మన్ మహేశ్వరరెడ్డి, నాయకులు డి.వాసు, శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ రామ్‌నాథ్ రెడ్డి, చిన్న లక్ష్మన్న, వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, పంచలింగాల వెంకటేశ్వరరెడ్డి, గొందిపర్ల గోపాల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సంత మార్కెట్‌కు వేలం

గూడూరు: వాయిదా పడిన మున్సిపల్ వేలాలను బుధవారం నిర్వహిస్తామని కమిషనర్ వి.దివాకరరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వారపు సంత మార్కెట్, పెద్ద పశువుల మాంసం మార్కెట్, కమేళకు బహిరంగ వేలం నిర్వహిస్తామని, ఆసక్తి ఉన్న వారు పాల్గొనవచ్చన్నారు.

పరిశ్రమ వివరాలను నమోదు చేయండి

సి.బెళగల్: మండలంలోని చిన్న తరహా పరిశ్రమల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంపీడీఓ శకుంతల అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయ ఇంజినీర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ రాయితీలు, ప్రోత్సాహకాలు తదితర వాటి కోసం పరిశ్రమల వివరాలను తీసుకోవాల్సి ఉందన్నారు. పల్లెల్లో పొదుపు మహిళలు, వ్యక్తులు ఏర్పాటు చేసుకున్న కుటీర, చిన్న తరహా పరిశ్రమల వివరాలను గ్రామ వలంటీర్ల దారా సేకరించి, వివరాలను ఎంఎస్ఎంఈ యాప్‌లో వారం తంలోగా నమోదు చేయాలని ఆదేశించారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు

కర్నూలు: రోడ్డుకు ఇరువైపులా మొబైల్ క్యాంటీన్లు, తోపుడు బండ్లు పెట్టి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో మంగళవారం చెన్నమ్మ సర్కిల్‌లో పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న పండ్లు, టిఫిన్ బండ్లు, మొబైల్ క్యాంటీన్లను తొలగించారు. తోపుడు బండ్లను ట్రాఫిక్ స్టేషన్‌కు తరలించారు. చిరు వ్యాపారులు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు పాటించాలని, లేకుంటే కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని ట్రాఫిక్ సీఐ గౌతమి హెచ్చరించారు.

సమస్యాత్మక పోలింగ్ బూత్‌ల పరిశీలన



మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

కోడుమూరు రూరల్: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ సృజన అన్నారు. మంగళవారం కోడుమూరులో సమస్యాత్మకమైన పోలింగ్ బూత్‌లను ఎస్పీ కృష్ణకాంత్‌తో కలిసి పరిశీలించారు. గొడవలకు ఆస్కారం లేకుండా.. ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని స్థానికులకు సూచించారు. ఆమె వెంట కర్నూలు ఆర్డీఓ శేషిరెడ్డి, కోడుమూరు సీఐ మన్సురుద్దీన్, తహసీల్దార్ గుర్రప్ప, బూత్ లెవల్ ఆఫీసర్లు ఉన్నారు.

పదిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



ఉపాధ్యాయులతో సమీక్షిస్తున్న డీఈఓ శ్యామ్యూల్

సి.బెళగల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణ సాధించేలా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ శ్యామ్యూల్ అన్నారు. మంగళవారం సి.బెళగల్ మండలం పోలకల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రకాష్ ప్రవీణ్ నిర్వహించిన సున్నితత్వపు భవిష్యత్ నైపుణ్య నిపుణత అంశంపై వీడియో కాన్ఫరెన్స్‌కు పాఠశాల టీచర్లు, విద్యార్థులతో కలిసి హాజరయ్యారు. అనంతరం పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులతో సమావేశమై వారి విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. హెచ్‌ఎం రమ ఉన్నారు.

అన్ని ప్రాంతాల్లో ఉపాధి పనులు

- డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి



పనులను తనిఖీ చేస్తున్న డ్వామా పీడీ

సి.బెళగల్: అన్ని ప్రాంతాల్లో ఉపాధి పనులు జరిగేలా చూడాలని డ్వామా పీడీ అన్నారు. మంగళవారం సి.బెళగల్‌లో జరుగుతున్న చెక్‌డ్యామ్, వంకలో పూడికతీత పనులు, కందకాల తవ్వకాల పనులను ఆయన తనిఖీ చేశారు. ఒకే ప్రదేశంలో ఎక్కువ సంఖ్యలో కూలీలతో పనులు చేయించడంపై ఉపాధి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని ప్రాంతాల్లో పనులు జరిగేలా చూడాలని ఆదేశించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో సమీక్షించారు. గ్రామ సభల నిర్వహణ, సిబ్బంది పనితీరు సరిగ్గా లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీడీఓ శకుంతల, ఉపాధిహామీ ఏపీఓ లక్ష్మన్న, ఈసీ పృథ్వీరాజ్, టీఏలు, ఎఫ్ఏలు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీని మళ్లీ గెలిపిద్దాం



మాట్లాడుతున్న లోటర్‌బాషా

ఓర్వకల్లు: ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్‌బాషా పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో బూత్ స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. 'మేము సిద్ధం..మా బూత్ సిద్ధం' అనే కార్యక్రమంలో భాగంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజలు సంపూర్ణ మద్దతు తెలపాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా లక్షలాది కుటుంబాలు లబ్ధిపొందినట్లు తెలిపారు. టీడీపీ చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు శకుంతలమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు సరోజమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు బొమ్మన రామిరెడ్డి, ఎల్లశేఖర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, సచివాలయ కన్వీనర్లు మహ్మద్ ఇస్మాయిల్, గోకారి, బొమ్మన భారతి తదితరులు పాల్గొన్నారు.

నేడు రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

గడివేముల: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో జగనన్న కాలనీలోని ఇళ్ల పట్టాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను అందించేందుకు బుధవారం పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి వస్తున్నట్లు తహసీల్దార్ జమానుల్లా ఖాన్ మంళవారం తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన లబ్ధిదారులతో పాటు ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరించాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

కల్లూరు: మేము సిద్ధం.. మా బూతు సిద్ధం కార్యక్రమాన్ని మంగళవారం కల్లూరు అర్బన్ 29, 37వ వార్డులకు సంబంధించి నాయకులతో నిర్వహించినట్లు కల్లూరు అర్బన్ జేసీఎస్ కన్వీనర్ ఇన్‌చార్జ్ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మంచిని, ప్రజలు పొందిన లబ్ధిని ఇంటింటికీ తిరిగి వివరించాలని సూచించారు. రాబోయ్యే ఎన్నికల్లో పార్టీ విజయానికి అందరు కలిసి సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కల్లూరు అర్బన్ క్లస్టర్ అధ్యక్షుడు (కార్పొరేటర్)సాన శ్రీనివాసులు, భీమాశంకర్‌రెడ్డి, కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి, వార్డు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

అందరికీ వైద్య పరీక్షలు



బస్తిపాడులో ఫ్యామిలీ ఫిజిషియన్ సేవల్లో పాల్గొన్న డీఎంహెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్య

కల్లూరు: అవసరమైన వారందరికీ ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ రామగిడ్డయ్య అన్నారు. మంగళవారం బస్తిపాడు, కె.నాగలాపురం, ఉల్చాల, పర్ల గ్రామాల్లో ఆయన పర్యటించారు. బస్తిపాడు, కె.నాగలాపురం గ్రామాల్లో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలను, ఉల్చాల, పర్ల గ్రామాల్లో పల్స్ పోలియో మూడవ రోజు కార్యక్రమాన్ని పరిశీలించారు. డీఎంహెచ్ఓ ఫ్యామిలీ ఫిజిషియన్ సేవల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వాతావరణ పరిస్థితుల్లో మార్పుల వల్ల వచ్చే అనారోగ్య సమస్యలను ప్రజలకు తెలియజేస్తూ ఎప్పటికప్పుడు అప్రమతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్ మోతీలాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పక్కీరప్ప తాత ఆరాధన



తాత చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

కోడుమూరు రూరల్: కోడుమూరులో మహాయోగి పక్కీరప్ప తాత ప్రథమ ఆరాధనోత్సవాన్ని భక్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం మహాగణపతి పూజ, సంప్రోక్షణ, గంగాపూజ, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు చేశారు. మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, శైలజ దంపతులు, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సతీష్, జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు క్రిష్టారెడ్డి, శ్రీలక్ష్మీ వేంకటేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ ఎద్దుల మహేశ్వరరెడ్డి, చనుగొండ్ల ప్రతాప్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఈశ్వరరెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు సంపూర్ణ భగవద్గీత పారాయణం

కర్నూలు కల్చరల్: మాఘ విజయ ఏకాదశిని పురస్కరించుకుని సంకల్ బాగ్‌లోని శ్రీగీతా ప్రచార ధామంలో బుధవారం ఉదయం 9.30 గంటల నుంచి సంపూర్ణ భగవద్గీత పారాయణం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు డీవీ రమణ తెలిపారు.